

ఆత్మహత్యలు ఆగేదెలా? 8లో▸

బాసర గోదావరి తీరం వద్ద ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. మహారాష్ట్రతో పాటు నిజామాబాద్ జిల్లాకు చెందినవారు బ్రిడ్జిపైనుంచి నదిలోదూకి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

ఆదిలాబాద్‌టౌన్: తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యమని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్‌లోని కంగారు మదర్స్‌కేర్ యూనిట్‌లో తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యతపై మెడికోలకు సోమవారం అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముర్రుపాలలోనే పోషక విలు వలు ఉంటాయని, డబ్బా పాలతో బిడ్డ అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో నోడల్ అధికారి అనంత్‌రావు, వైద్యురాలు హేమలత, తిరుమల్ రెడ్డి ఉన్నారు.

గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

12 మంది ఏవోలకు స్థానచలనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న 12మంది ఏవోలకు సోమవారం స్థానచలనం కలిగింది. ఆదిలాబాద్ అర్బన్‌లో పనిచేస్తున్న భగత్ రమేశ్ గుడిహత్నూర్‌కు బదిలీ కాగా, జైనథ్‌లో పనిచేసే వివేక్‌కు ఆదిలాబాద్‌అర్బన్, గుడిహత్నూర్‌లో పనిచేసే రేవతి హైదరాబాద్‌లోని సాయిల్ కన్జర్వేషన్‌కు బదిలీ అయ్యారు. అలాగే ఆదిలాబాద్‌రూరల్‌లో పనిచేసే అష్రఫ్ జైనథ్–2కు బదిలీ అయ్యారు. బజార్‌హత్నూర్‌లో పనిచేసే ప్రమోద్‌రెడ్డి తలమడుగుకు బదిలీ కాగా, తలమడుగులో పనిచేసే మహేందర్ భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు. అలాగే జేడీఏ కార్యాలయంలో టెక్నికల్ అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి భీంపూర్‌కు బదిలీ అయ్యారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీఎల్‌లో పనిచేస్తున్న శివకుమార్ జేడీఏ కార్యాలయం టెక్నికల్ అధికారిగా స్థానచలనం కలిగింది. నార్నూర్‌లో పనిచేస్తున్న గిత్తే రమేశ్ ఉట్నూర్‌కు బదిలీ కాగా, ఉట్నూర్‌లో పనిచేసే రాథోడ్ గణేశ్ ఇంద్రవెల్లికి బదిలీ అయ్యారు. బీసీఎల్‌లో పనిచేస్తున్న సంధ్యారాణి ఎస్టీఎల్‌కు బదిలీ అయ్యారు. ఎస్టీఎల్‌లో పనిచేస్తున్న షాహిద బీసీఎల్‌కు బదిలీ అయ్యారు. మొత్తంగా 12 మంది ఏవోలకు మల్టీజోన్–1లో స్థానచలనం కలిగింది. అయితే ఇందుకు సంబంధించి బదిలీ ఉత్తర్వులు విడుదల కావాల్సి ఉంది. కాగా నార్నూర్, బేల, బజార్‌హత్నూర్, సిరికొండ, జైనథ్, మావల, ఆదిలాబాద్‌రూరల్ ఏవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

జిల్లా టీబీ నియంత్రణ అధికారిగా సుమలత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా క్షయవ్యాధి (టీబీ) నియంత్రణ అధికారిగా డాక్టర్ సి.సుమలత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ఎపడాలమిజిస్ట్‌గా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాకు రెగ్యులర్ అధికారిగా వచ్చారు. కాగా 2010 నుంచి ఈ పోస్టు ఇన్‌చార్జిలతోనే కొనసాగుతుంది. అప్పట్లో రెగ్యులర్ అధికారిగా ఉన్న డాక్టర్ మునిశేఖర్ ఏసీబీకి పట్టుబడడంతో అప్పటినుంచి ఇప్పటివరకు ఖాళీగా ఉంది. 14 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు రెగ్యులర్ అధికారితో భర్తీ అయింది. ప్రస్తుతం ఇన్‌చార్జి టీబీ నియంత్రణ అధికారిగా పనిచేస్తున్న సాయిప్రియ నుంచి ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. టీబీ నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై సమీక్షించారు. కార్యాలయ ఉ ద్యోగులు, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్ కుమార్తెకు ఆరు ఉద్యోగాలు

ఆసిఫాబాద్‌రూరల్: పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని నిరూపించారు నిఖిత కేతావత్. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బుగ్గారం గ్రామానికి చెందిన సర్దార్ సింగ్–సంధ్య దంపతుల కుమార్తె నిఖిత ఆరు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై సత్తా చాటింది. సర్దార్ సింగ్ ప్రస్తుతం ఆసిఫాబాద్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. పీజీ, బీఈడీ పూర్తి చేసిన అనంతరం ఆమె పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో గురుకుల డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీతో పాటు టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లోనూ సత్తాచాటి గ్రూప్–4, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రస్తుతం నిర్మల్‌లో సోషల్ వెల్ఫేర్ పరిధిలో డిగ్రీ లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరినట్లు నిఖిత తండ్రి వెల్లడించారు.

అప్పు రాబట్టేదెట్లా..!?

- వాటేపల్లి ఏఎంసీకి రుణమిచ్చిన ఆదిలాబాద్ ఏఎంసీ
- పదేళ్ల క్రితం రూ.కోటి 59లక్షలు అందజేత
- ఇప్పటివరకు సగం కూడా చెల్లించలే
- జిల్లాలో అభివృద్ధి పనులకు ఆటంకం
- ఏకీకృత ఆడిట్ సమీక్ష నివేదికలో వెల్లడి



ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

రుణం వివరాలు..
ఇచ్చిన రుణం : రూ.1 కోటి 59 లక్షలు
ఒప్పందం జరిగిన తేది: 2014 నవంబర్ 19
చెల్లించాల్సిన వాయిదాలు : ఏడాదికి ఒకటి చొప్పున 10 కిస్తీలు
వడ్డీ శాతం : 12.5
ఇప్పటివరకు చెల్లించింది : రూ.65 లక్షల 90వేలు
ఇంకా చెల్లించాల్సిన అసలు : రూ.93లక్షల 10వేలు (వడ్డీ కాకుండా)

సాక్షి,ఆదిలాబాద్: మింగ మెతుకు లేదు కానీ.. మీసాలకు సంపెంగ నూనే.. అన్నట్లు ఉంది వ్యవహారం. మనకొచ్చే ఆదాయమే తక్కువ.. అందులోంచి పరాయోనికి అప్పు ఇవ్వడమంటే ఇదే. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి పదేళ్ల క్రితం సంగారెడ్డి జిల్లాలోని వాటేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇక్కడి ఆదాయాన్ని వారికి ఇచ్చారు. వడ్డీ రూపేనా తిరిగి ఇస్తారని ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత అసలులో కొంత మొత్తం కట్టి మిగతాది చెల్లించకుండా మిన్నకుండిపోయారు. వడ్డీ ఊసే లేదు. మరి ఆ డబ్బులను వసూలు చేసే మార్గం ఎలా.. ఇక్కడ అభివృద్ధి పనులకు వెచ్చించాల్సిన నిధులను ఇలా వడ్డీగా ఇస్తే అసలే పూర్తిగా ఇవ్వలేనిపరిస్థితిలో నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

అప్పు ఒప్పందం వివరాలు..

ఆదిలాబాద్ ఏఎంసీ నుంచి సంగారెడ్డి జిల్లాలోని వాటేపల్లి ఏఎంసీకి 2014లో 12.5 శాతం వడ్డీ ఒప్పందంతో రూ.1 కోటి 59 లక్షలు ఇచ్చారు. దీనికి సంబంధించి డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిషనర్ నుంచి ప్రొసీడింగ్ 2014 నవంబర్ 19న జారీ అయింది. దాని ప్రకారం వాటేపల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి పనుల కోసం ఈ డబ్బులు అప్పుగా ఇస్తున్నట్లు ఇరువురు మార్కెట్ కమిటీ అధికారుల మధ్య అదే సంవత్సరం నవంబర్ 26న ఒక ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ఈ రుణ మొత్తాన్ని పది సమాన వాయిదాల పద్ధతిలో ఏడాదికి రూ.15లక్షల 90వేల చొప్పున వడ్డీతో కలిపి తిరిగి చెల్లించాలని నిర్ణయించారు. ఇక్కడివరకు అంతా సబబుగానే జరిగింది. అసలు తతంగం ఆ తర్వాత చోటుచేసుకుంది.

అభివృద్ధి పనులు చేపట్టేదెలా..

కొత్త జిల్లాల విభజన జరగకముందు ఇది చోటు చేసుకుంది. ఆదిలాబాద్ ఏఎంసీ నుంచి వాటేపల్లి ఏఎంసీకి ఆ మొత్తం రుణ రూపేనా ఇవ్వడం జరిగింది. సాధారణంగా మార్కెట్ కమిటీల్లో పంట దిగుబడుల క్రయ విక్రయాలు జరిగినప్పుడు కొనుగోలుదారు నుంచి అంటే ట్రేడర్ల నుంచి మార్కెట్‌కు ఒక శాతం సెస్ రూపేనా ఆదాయం లభిస్తుంది. ఇలా ఆదిలాబాద్ ఏఎంసీకి ప్రస్తుతం ఏడాదికి రూ.8 కోట్ల నుంచి రూ.10కోట్ల వరకు ఆదాయం లభిస్తుంది. ఇందులో నుంచి ఉద్యోగులు, సిబ్బందికి సంబంధించి వేతనాల చెల్లింపులు చేస్తారు. అంతేకాకుండా రైతులకు ఉపయోగపడే విధంగా గోదాములు, షెడ్లు, మార్కెట్ కమిటీలలో అభివృద్ధి పనులు వంటివి చేపడతారు. ఇక్కడ అనేక పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉండగా, ఇక్కడి ఆదాయాన్ని మరో మార్కెట్‌కు తరలించడం, ఆ మొత్తం తిరిగి వారు చెల్లించక పోవడం వంటివి చోటు చేసుకోవడం గమనార్హం.

ఈ వచ్చే నవంబర్‌తో ఇచ్చిన గడువు పూర్తి కానుంది. అయితే వాటేపల్లి ఏఎంసీ ఇప్పటి వరకు రూ.65లక్షల 90వేలు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.93లక్షల 10వేలు చెల్లించాలి. దానికి తోడు వడ్డీ కూడా కలిపి ఇవ్వాలి.

చెల్లించింది స్వల్పమే..

సమాన వాయిదాల పద్ధతిలో చెల్లింపులను చూస్తే ఈపాటికి కేవలం రూ.15లక్షల 90వేలు మాత్రమే అసలు మిగిలి ఉండాలి. దీనికి ఎన్నో రేట్లు రెట్టింపులో బకాయి ఉంది. వడ్డీతో పాటు ఇన్‌స్టాల్‌మెంట్ మొత్తాలు తిరిగి చెల్లించడం లేదని, తక్షణ చర్య అవసరమని రాష్ట్ర ఆడిట్ శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటీవల 2020–21 సంవత్సరపు ప్రభుత్వ ఖాతాలపై ఏకీకృత ఆడిట్, సమీక్ష నివేదికను రాష్ట్ర సంచాలకులు వెల్లడించారు. ఇందులో వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆడిట్ అంశంలో దీన్ని పేర్కొన్నారు. ఇది మూడేళ్ల కిందటి ఖాతాలపై ఆడిట్ చేయగా వెల్లడైన విషయం. అయితే ఇప్పటికీ అంతే మొత్తం చెల్లింపులు జరిగినట్లుగా ఉండటం, ఆ బకాయి అలాగే ఉండటం గమనార్హం. తద్వారా ఇది గుదిబండగా మారిందని స్పష్టమవుతుంది.

ఎవరు చొరవ తీసుకోవాలి..

ఇప్పుడు ఈ మొత్తాన్ని తిరిగి రాబట్టేందుకు ఎవరు చొరవ తీసుకోవాలి అనే ప్రశ్న తలెత్తుతుంది. పదేళ్ల క్రితం ఇచ్చినటువంటి రుణానికి సంబంధించి వడ్డీతో కలుపుకొని ఇప్పుడు వసూలు చేయాలి. అయితే జిల్లా స్థాయి నుంచి అధికారులు ఈ విషయంలో రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ అక్కడినుంచి చెల్లించడం లేదని తెలుస్తుంది. ఈ పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ఆదిలాబాద్ మార్కెట్‌కు రావాల్సిన మొత్తాన్ని వసూలు చేయడం ద్వారా ఇక్కడ అభివృద్ధి పనులకు దోహదపడాలనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

పలుమార్లు సంప్రదించాం..



వాటేపల్లి ఏఎంసీ నుంచి రుణబకాయిని రాబట్టేందుకు ఉత్తర, ప్రత్యుత్తరాలు జరుపుతున్నాం. ఆ మొత్తం వసూలు చేసే విషయంలో పలుమార్లు సంప్రదించాం. తొందరలోనే ఆ మొత్తాన్ని తిరిగి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాం.

– శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి

‘స్వచ్ఛదనం’లో భాగస్వాములవ్వాలి



మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే శంకర్, మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్

- ఉత్తమ సేవలందించే వారికి 15న సన్మానం
- ‘స్వచ్ఛదనం– పచ్చదనం’ను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: స్వచ్ఛదనం–పచ్చదనంలో ప్రజలంతా భాగస్వాములై పట్టణాన్ని పచ్చదనంతో పాటు పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలో సోమవారం లాంఛనంగా ప్రారంభించారు.తొలుత మున్సిపల్‌కౌన్సిలర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, మెప్మా రిసోర్సుపర్సన్లు, అధి కారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి విద్యాశాఖాధికారి కార్యాలయం వరకు కార్యక్రమ ప్రాధాన్యత చాటేలా అవగాహన ర్యాలీ చేపట్టారు. డీఈవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే శంకర్, మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్‌తో కలిసి కలెక్టర్ పలు రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పట్టణంలో కుక్కల బెడద నియంత్రించేందుకు గాను స్టెరిలైజేషన్ చేపట్టేలా బర్త్ ఏనిమల్ కేర్ సెంటర్‌కు పశుసంవర్ధకశాఖ ద్వారా ఓ వైద్యుడిని ప్రత్యేకంగా కేటాయిస్తామన్నారు. డెంగీ, విష జ్వరాలు నమోదవుతున్న కాలనీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో ప్రతీ వార్డుకు చెత్త సేకరణ వాహనం తప్పనిసరిగా వెళ్లాలన్నారు. తడి, పొడి చెత్త అందించేలా రిసోర్సు పర్సన్లు ఒక్కొక్కరు 20 ఇళ్లను తీసుకుని అవగాహన కల్పించాలని సూచించారు. 7వ తేదీన పట్టణమంతా ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకం నియంత్రించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించడంతో పాటు 3వ శనివారం గ్రామాలు, వార్డుల్లో ప్రజలు, అధికారులు శ్రమదానం చేపట్టాలన్నారు. ఈ ఐదు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు ఈ నెల 15న సన్మానించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని పారిశుద్ధ్య సమస్య నివారణకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని భరోసానిచ్చారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, డీఈవో ప్రణీత, రెవెన్యూ అధికారి జాదవ్ కృష్ణ, మెప్మా టీఎంసీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ శ్రమదానం

స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మావల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ రాజర్షి షా శ్రమదానం చేశారు. అధికారులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులతో కలిసి పిచ్చి మొక్కలు తొలగించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఇందిరా మహిళాశక్తి రుణాలతో ఏర్పాటు చేసిన వివిధ రకాల యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్, ట్రెయినీ కలెక్టర్‌ను రైతు వేదికలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి శాలువాలతో సత్కరించారు. ఇందులో మండల ప్రత్యేకాధికారి కె.రాజలింగు, ఎంపీడీవో శోభన, హెచ్‌ఎం సరోజ, తదితరులున్నారు.

ఆకట్టుకున్న వాల్ పెయింటింగ్ పోటీలు

స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మున్సిపల్ ఆధ్వర్యంలో సోమవారం వాల్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాల యం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి పట్టణంలోని పలు పాఠశాలలకు చెందిన 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణ,పారిశుద్ధ్య నిర్వహణప్రాధాన్యత చాటేలా వారు వేసిన పెయింటింగ్‌లు ఆకట్టుకున్నాయి. వాటిని కలెక్టర్ రాజర్షి షా, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ పరిశీలించారు. విజేతలకు ఈనెల 9న బహుమతి ప్రదానం చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇందులో మున్సిపల్ ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు పిప్రికి డిప్యూటీ సీఎం రాక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

బజార్‌హత్నూర్: ఈనెల 7న పిప్రికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రానున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023 మార్చి 16న భట్టి విక్రమార్క సీఎల్పీ హోదాలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలనే లక్ష్యంతో పిప్రి నుంచి పాదయాత్ర ప్రారంభించారన్నారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పిప్రి గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తానని నాడు భట్టి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పిప్రి వద్ద ప్రజాపాలన సభ నిర్వహించాలని డిప్యూటీ సీఎం భావించారు. అయితే ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడగా తాజాగా ఈనెల 7న భట్టి టూర్ షెడ్యూల్ ఖరారైనట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు ఆత్రం సుగుణ, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సయ్య తదితరులున్నారు.

ఉప ముఖ్యమంత్రి టూర్ షెడ్యూల్..

కైలాస్‌నగర్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జిల్లా పర్యటన అధికారికంగా ఖరారైంది. ఈ నెల 7న ఉదయం 10.30గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో బయలుదేరి 11.30గంటలకు బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రికి చేరుకుంటారు. ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న రోడ్లు, నేరడిగొండ మండలం వాంకిడిలో ఏర్పాటు చేయనున్న సబ్‌స్టేషన్‌కు భూమిపూజతో పాటు గ్రామంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఎస్సీ, ఎస్టీ, ఇందిరా మహిళా శక్తి లబ్ధిదారులకు వివిధ పథకాల కింద మంజూరైన ఆస్తులను పంపిణీ చేస్తారు. అనంతరం అక్కడ నిర్వహించే బహిరంగసభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2.25గంటలకు పిప్రి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

పీఆర్‌లో ఇంజినీర్ల కొరత

- ఒక్కో అధికారికి మూడేసి మండలాల అదనపు బాధ్యతలు
- క్షేత్రస్థాయిలో లోపిస్తున్న పర్యవేక్షణ
- ప్రశ్నార్థకంగా పనుల నాణ్యత



జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ కార్యాలయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా పంచాయతీరాజ్ శాఖను ఇంజినీర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లాకు ఏఈఈ, ఏఈ పోస్టులు 31 మంజూరు ఉండగా అందులో కేవలం 10మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఒక్కో అధికారికి మూడు, నాలుగేసి మండలాల బాధ్యతలను అదనంగా అప్పగించారు. దీంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపిస్తోంది. ఫలితంగా పనుల ప్రగతి మందకొడిగా సాగుతోంది. అదనపు బాధ్యతలతో ఉన్న అధికారులపై పని ఒత్తిడి పెరుగుతోంది. పాలన సౌలభ్యం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సబ్ డివిజన్లను పెంచినప్పటికీ ఇంజినీరింగ్ అధికారులను నియమించకపోవడంతో ఆ శాఖ పాలన వ్యవహారాలు పూర్తిగా గాడి తప్పుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. జిల్లా పీఆర్ ఇంజినీరింగ్ వ్యవస్థను పర్యవేక్షించాల్సిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) పోస్టు సైతం ఖాళీగా ఉండటం గమనార్హం.

డీఈలున్నా... ఈఈ పోస్టు ఖాళీ

జిల్లా పంచాయతీరాజ్‌లో 17 గ్రామీణ మండలాల వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) పోస్టుతో పాటు ఆదిలాబాద్, బోథ్,ఇచ్చోడ, ఉట్నూర్, నార్నూర్(ఉట్నూర్), తలమడుగు (తాంసి) సబ్ డివిజన్లున్నాయి. గతంలో ఆదిలాబాద్, బోథ్, ఉట్నూర్ ఉండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా తలమడుగు, నార్నూర్, ఇచ్చోడ సబ్ డివిజన్లను అదనంగా ఏర్పాటు చేసింది. మొన్నటి వరకు వీటికి కూడా ఏఈలే ఇన్‌చార్జి డీఈలుగా వ్యవహరించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం జూన్ నెలాఖరులో ఏఈలుగా పనిచేస్తున్న సీనియర్ అధికారులకు డీఈలుగా పదోన్నతికల్పించింది. దీంతో ప్రస్తుతం అన్ని సబ్ డివిజన్ కార్యాలయాలకు రెగ్యులర్ అధికారులు పనిచేస్తున్నారు. కాగా ఈఈ పోస్టు మాత్రం ఖాళీగా ఉండటంతో తలమడుగు డీఈవోగా పనిచేస్తున్న శివరాంకు ఇటీవల ఈఈగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన జోడు పదవుల్లో అటు సబ్‌డివిజన్‌తో పాటు ఇటు ఈఈగా జిల్లా మొత్తానికి సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించాల్సి వస్తోంది.

ఇబ్బందికరంగా మారిన ఖాళీలు

జిల్లా ఇంజినీరింగ్ విభాగంతో పాటు సబ్ డివిజన్ పరిధిలో ఏఈ, ఏఈఈ, ఎంఈవో పోస్టులు జిల్లాకు 31 మంజూరు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం పది మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో నలుగురు జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. తలమడుగు సబ్ డివిజన్‌లో ఒకరు, ఇచ్చోడ పరిధిలో ఇద్దరు, నార్నూర్ పరిధిలో ఒకరు పనిచేస్తున్నారు. మండలాల విషయానికి వస్తే బేల, తలమడుగు మండలాల్లో మాత్రమే మండల ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు. దీంతో ఉన్న పదిమందికే మిగతా మండలాల అదనపు బాధ్యతలు అప్పగించారు. గ్రామీణ వ్యవస్థలో పంచాయతీరాజ్‌ది కీలకపాత్ర. రూ.కోట్లాది వ్యయంతో చేపట్టే అంగన్‌వాడీ, పంచాయతీ, పాఠశాలల భవనాలు, కమ్యూనిటీ కేంద్రాలతో పాటు రోడ్లు, వంతెనల నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన కీలక బాధ్యత ఈ శాఖ అధికారులదే. సరిపడా అధికారులు లేకపోవడంతో ఉన్నవారికి మూడు, నాలుగు మండలాల అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో క్షేత్రస్థాయిలో పనులపై పర్యవేక్షణ కొరవడుతుంది. అలాగే ఎంబీ రికార్డుల నిర్వహణకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. అయితే ఇటీవల ఏఈఈ ఉద్యోగాల ఫలితాలు రావడంతో త్వరలోనే ఈ పోస్టుల భర్తీ అయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. అప్పటి వరకు ఈ తిప్పలు తప్పవని చెబుతుండటం విశేషం.

జిల్లా పంచాయతీరాజ్ విభాగానికి మంజూరైన, ప్రస్తుతం పనిచేస్తున్న పోస్టులు, ఖాళీలు వివరాలు

ఇంజినీరింగ్ విభాగం	మంజూరైన పోస్టులు	పనిచేస్తుంది	ఖాళీలు
జిల్లా పంచాయతీరాజ్	03	01	02
మండల ఇంజినీరింగ్ అధికారులు (ఎంఈవో)	17	02	15
సబ్ డివిజన్ ఏఈఈ, ఏఈ	11	07	04

‘అమ్మ’కే బడి శుభ్రత బాధ్యత

- ‘ఆదర్శ కమిటీ’లకు అప్పగింత
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు
- ప్రభుత్వం ఉత్తర్వులు
- తీరనున్న స్కావెంజర్ల సమస్య

జిల్లాలో..
ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు : 690
ఇందులో చదువుతున్న విద్యార్థులు : 65వేలు



భీంపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల

ఆదిలాబాద్‌టౌన్:సర్కారు బడులబలోపేతం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మౌలిక వసతుల కోసం అమ్మ ఆదర్శ కమిటీలకు బాధ్యతలు అప్పజెప్పగా.. తాజాగా ఆయా పాఠశాలల్లో పరిశుభ్రత బాధ్యతలు సైతం వారికే అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సర్కారు బడుల్లో స్కావెంజర్లు లేక అపరిశుభ్రత నెలకొంటుంది. బడులను ఆయా గ్రామాల్లోని పారిశుధ్య కార్మికుల ద్వారా అప్పుడప్పుడు శుభ్రం చేయిస్తున్నారు. కొన్ని చోట్ల ఉపాధ్యాయులే సొంత డబ్బుతో పాఠశాలలను శుభ్రపరిచేలా చూస్తుండగా, మరికొన్ని బడుల్లో విద్యార్థులే పరిశుభ్రత చర్యలు చేపడుతున్నారు. గత కొన్ని నెలలుగా పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడంతో బడులు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఎట్టకేలకు ఈ సమస్యకు పరిష్కారం లభించింది.

నిధులు విడుదల..

ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు విడుదల చేస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఒక పాఠశాలలో 30 లోపు విద్యార్థులు ఉంటే రూ.3వేల గ్రాంట్ విడుదల చేయనుంది. 31 నుంచి 100 లోపు విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలకు రూ.6వేలు, 101 నుంచి 250 మంది ఉంటే రూ.8వేలు, 251 నుంచి 500 వరకు ఉంటే రూ.12వేలు, 501 నుంచి 750 వరకు ఉంటే రూ.15వేలు, 750 మందికి మించి ఉన్న పాఠశాలలకు రూ.20వేల చొప్పున గ్రాంట్ విడుదల చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ఈ మొత్తాన్ని పది నెలలకు సంబంధించి ఒకేసారి విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

స్కావెంజర్ల నియామకంతో ఇబ్బందులు దూరం..

కొద్ది నెలల క్రితం పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లను తొలగించారు. అప్పటి నుంచి బడుల్లో అపరిశుభ్రత నెలకొంటుంది. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలకు నీరు లేక ఎండిపోతున్నాయి. అలాగే మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటిలో నీటిని ఉపయోగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. చాలా పాఠశాలల్లో టాయిలెట్స్ నిరుపయోగంగా మారాయి. స్కావెంజర్లను నియమిస్తే తరగతి గదుల శుభ్రతతో పాటు పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లు తదితరవి శుభ్రంగా ఉంచే అవకాశం ఉంటుంది. అమ్మ ఆదర్శ కమిటీలకు ఈ బాధ్యతలు అప్పజెప్పడంతో పాఠశాలలు మరింత పరిశుభ్రంగా ఉండే అవకాశం ఉంటుంది.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నం.2లో ఆదిలాబాద్‌అర్బన్, మావల మండలాల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని సూచించారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని పేర్కొన్నారు. న్యాస్ పరీక్షల్లో జిల్లా ముందు వరుసలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. ఇందులో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లచ్చిరాం, సెక్టోరియల్ అధికారి శ్రీకాంత్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, రిసోర్స్ పర్సన్లు వెంకటేశ్, రాజేశ్వర్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పకడ్బందీగా అమలు చేయాలి

మధ్యాహ్న భోజనం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నం.2ను సోమవారం పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెడుతున్నారా.. లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వంట గదులతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదేశించారు.

క్లుప్తంగా

మద్యం దుకాణంలో చోరీ

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌లోగల శ్రీవైన్స్‌లో చోరీ జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి పక్కన ఉండే శ్రీవైన్స్ యజమాని ఆదివారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో దుకాణం తెరిచేందుకు రాగా, షట్టర్ తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పట్టణ పోలీసులు, క్లూస్ టీం సిబ్బంది అక్కడికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వైన్స్ షట్టర్ తాళాలు పగుల గొట్టి లోపలికి చొరబడినట్లు ఫుటేజీలో గుర్తించారు. కాగా, నిందితులు గల్ల పెట్టెలోని రూ.40వేల నగదు, మద్యం బాటిళ్లు దొంగిలించారు. క్లూస్ టీం సిబ్బంది వివరాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: మండలంలోని పిప్పల్‌ధరి, మామిగూడ శివారు ప్రాంతంలో సోమవారం గంజాయి పట్టుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. ఆదిలాబాద్‌రూరల్ మండలం పిప్పల్‌ధరి గ్రామపంచాయతీ పరిధిలో గల దహిగూడ గ్రామానికి చెందిన లక్ష్మణ్ గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మామిడిగూడ వైపు ఆయన గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కాగా, నిందితుడి మామ సిడాం రాజు పంట పొలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దీని విలువ రూ.10వేలు ఉంటుందని తెలిపారు. కాగా, సిడాం రాజు పంట పొలాన్ని పరిశీలించగా మూడు గంజాయి మొక్కలు లభ్యమైనట్లు వివరించారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుప్టి బ్రిడ్జిపై లారీ బోల్తా



బ్రిడ్జి పక్కన బోల్తా పడ్డ లారీ

నేరడిగొండ: మండలంలోని కుప్టి బ్రిడ్జి వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వైపు ఆలుగడ్డల లోడ్‌తో వెళ్తున్న లారీ కుప్టి ఘాట్ సమీపంలోని బ్రిడ్జి పక్కన గల రోడ్డు వద్ద బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ప్రమాదానికి కారణమైన వాహనం స్వాధీనం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లిలో ఆదివారం రాత్రి ఆ కాలనీకి చెందిన సంద విఠల్ రోడ్డు దాటుతున్న క్రమంలో ఢీకొన్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీసీ ఫుటేజ్ ద్వారా ప్రమాదానికి కారణమైన కారును గుర్తించారు. కాగా, విఠల్ తీవ్ర గాయాలతో రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

ఆత్మహత్యలు ఆగేదెలా?

- బాసర బ్రిడ్జి వద్ద బలవన్మరణాలు
- గోదావరిలో దూకుతున్న బాధితులు
- స్నానఘట్టాల వద్ద తరచూ ప్రమాదాలు
- నీట మునిగి చనిపోతున్న భక్తులు
- రక్షణ చర్యలు చేపట్టని అధికారులు




గోదావరి నదిలో కొట్టుకువచ్చిన మృతదేహాలు (ఫైల్)

భైంసా: బాసర గోదావరి నదీతీరం వద్ద ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. వివిధ కారణాలతో మహారాష్ట్ర ప్రాంతంతోపాటు నిజామాబాద్ జిల్లా నుంచి వస్తున్నవారు బ్రిడ్జి పైనుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. నాలుగురోజుల్లోనే ఇక్కడ నాలుగు మృతదేహాలు లభించాయి. ఒకే రోజు నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదివారం బాసర వద్ద గోదావరి నదిలో మరో రెండు మృతదేహాలు కొట్టుకువచ్చాయి. బాసర రైల్వేస్టేషన్‌లో మార్చి 27న ఓ యువతి, యువకుడు నర్సాపూర్–నాగర్‌సోల్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నిషిత డిగ్రీ కాలేజీలో చదివిన చక్రవర్తుల నందితతోపాటు మరో యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇలా కుటుంబ కలహాలు, ఇతర కారణాలతో ఎంతోమంది ఇక్కడకు వచ్చి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

గుర్తించి.. రక్షిస్తున్న స్థానికులు

పలువురు గోదావరిలో దూకే సమయంలో గమనిస్తున్న స్థానిక యువకులు, జాలర్లు, గజ ఈతగాళ్లు వారిని పోలీసుల సహకారంతో కాపాడిన సందర్భాలనేకం. బాధితులు ఆత్మహత్య చేసుకోకుండా స్థానికులు కాపాడుతుండగా పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. వారి కుటుంబ సభ్యులను పిలిపించి పంపిస్తున్నారు. బాసర గోదావరి వంతెన నుంచి స్నానఘట్టాల వరకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షించాలని పలువురు సూచిస్తున్నారు. ఆత్మహత్యలు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బాసర యువకులు గతంలో ఆందోళన చేసి బాసర ఆలయ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. అయినా స్నానఘట్టాల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు.



బాసర వద్ద గోదావరి నది

గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం

గోదావరి నదీతీరం వద్ద ఆందోళనతో కనిపించివారిని గుర్తిస్తున్నాం. పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఆర్నెళ్లలో చాలామంది ప్రాణాలు కాపాడగలిగాం. బాసర యువకులు కూడా ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన వారిని ముందే గుర్తించి మాకు సమాచారం ఇస్తున్నారు. బాధితుల మానసిక పరిస్థితి తెలుసుకుని వారి కుటుంబీకులకు అప్పగిస్తున్నాం.

– గణేశ్, బాసర ఎస్సై

స్నానఘట్టాల వద్ద ప్రమాదాల్లో..

బాసర వంతెన నుంచి సూర్యేశ్వర ఆలయం వరకు కిలో మీటరు మేర స్నానఘట్టాలు నిర్మించారు. వానాకాలంలో గోదావరిలో నల్లమట్టి కొట్టుకువచ్చి స్నానఘట్టాల వద్ద పేరుకుపోతోంది. నల్లమట్టితోపాటు పూజా వ్యర్థాలను వెంటవెంట తొలగించడలో అధికారులు నిర్లక్ష్యం చేస్తుండగా భక్తులు పుణ్యస్నానాలు చేసే సమయంలో జారి గోదావరిలో పడుతున్నారు. పలువురు ప్రాణాలతో బయట పడుతుండగా.. కొందరు నీట మునిగి చనిపోయిన సందర్భాలనేకం. బాసర గోదావరి నది వద్ద తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. స్నానఘట్టాల వద్ద ఏర్పాట్లు సరిగా లేక ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. ఇలా పవిత్ర గోదావరి నదిలో తరచూ మృతదేహాలు కనిపిస్తుండటంతో ఆందోళనకు గురవుతున్నారు.

ప్రమాదాల్లో పలువురు..

దేశవ్యాప్తంగా నిత్యం వేలాదిమంది భక్తులు బాసరకు వస్తుంటారు. ఇలా వచ్చినవారిలో కొంతమంది పుణ్యస్నానాల సందర్భాల్లో ప్రమాదవశాత్తు మృత్యువాత పడుతున్నారు.

- 2022 ఏప్రిల్ 4వ తేదీన హైదరాబాద్ బంజారాహిల్స్ సరస్వతి హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల సందర్భంగా బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. గోదావరి నదిలో స్నానాలకు వెళ్లిన విద్యార్థుల్లో విశాల్ (15) ప్రమాదవశాత్తు నదిలో మునిగి మృతిచెందాడు.
- 2022 మే 14న మహారాష్ట్రలోని అకోల పట్టణానికి చెందిన 17 మంది విద్యార్థులు అమ్మవారి దర్శనానికి వచ్చారు. వీరు నదిలో స్నానం చేస్తుండగా కిరణ్ (22) అనే విద్యార్థి నీటిలో మునిగి అందులోనే ఉండిపోయాడు. గమనించిన మరో విద్యార్థి ప్రదీప్ (22) రక్షించబోయి నీటమునిగి మృతిచెందాడు.
- 2022 జూలై 14వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు జిల్లా కందుకూరు మండలం పొన్నలూరు గ్రామానికి చెందిన మణికంఠ (14) అనే విద్యార్థి పుణ్యస్నానానికి వచ్చి ప్రమాదవశాత్తు మృత్యువాతపడ్డాడు.
- 2023లో మహాశివరాత్రి పర్వదినాన మహారాష్ట్రకు చెందిన ప్రదీప్ (25) అనే యువకుడు పుణ్యస్నానానికి వచ్చి ప్రమాదవశాత్తు నదిలో మునిగి చనిపోయాడు.
- 2023 అక్టోబర్ ఒకటిన నిజామాబాద్‌లోని పాములబస్తీకి చెందిన సంతోష్ (18) స్నేహితులతో బాసరకు వచ్చాడు. గోదావరి నదిలో స్నానాల కోసం దిగి మృతిచెందాడు.
- 2023 అక్టోబర్ ఆరున నిజామాబాద్‌లోని గాజులపేట్‌కు చెందిన దుబ్బాక ఓడ్డయ్య (35) కూతురు పుట్టు వెంట్రుకలు తీసేందుకు బాసరకు వచ్చాడు. ఆనవాయితీ ప్రకారం శుభకార్యానికి ముందు గోదావరి నదిలో తెప్పను వదిలేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందాడు.
- ఈ నెల మొదటి వారంలోనే నిజామాబాద్‌కు చెందిన ఇద్దరు భక్తులు చనిపోయారు.

గిరిజన శిక్షణ, ఉపాధి కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన నిరుద్యోగ యువతీయువకుల కోసం గిరిజన శిక్షణ, ఉపాధి కార్యాలయాన్ని కలెక్టర్ రాజర్షి షా సోమవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి ప్రారంభించారు. కార్యాలయం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీయువకులకు ప్రతీరోజు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగావకాశాల కల్పనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగావకాశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిజన నిరుద్యోగ యువతీయువకులు ఈ కార్యాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీవో ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ.. ప్రతీరోజు వందల ప్రైవేట్ ఉద్యోగాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీవో వసంత్‌రావు, జేడీఎం నాగభూషణం, ఎస్‌డీసీ, డీపీవో తదితరులు పాల్గొన్నారు.

8న సింగరేణి, రామగిరి రైళ్ల రాకపోకలు బెల్లంపల్లి నుంచే..

బెల్లంపల్లి: సింగరేణి, రామగిరి రైళ్లు ఈనెల 8వ తేదీన బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చి ఇక్కడి నుంచే తిరుగు ప్రయాణం సాగించనున్నాయి. ఆయా రైళ్ల రాకపోకల సమయ సూచికను రైల్వే అధికారులు తాత్కాలికంగా మార్పు చేశారు. ఈ విషయాన్ని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఏ శ్రీధర్ సోమవారం ప్రకటించారు. భద్రాచలం రోడ్–బల్లార్షా మధ్య రోజూ రాకపోకలు సాగించే సింగరేణి మెమో (రైలు నంబర్ 17033), బల్లార్షా–కాజీపేట్ మధ్య నడిచే రామగిరి (రైలు నంబర్ 17004) రైళ్లను అప్, డౌన్ మార్గాల్లో బెల్లంపల్లి రైల్వేస్టేషన్ నుంచి నడుపనున్నట్లు తెలిపారు. ఇదేతీరుగా జైపూర్–మైసూర్ మధ్య నడిచే మైసూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్ 12976) రైలు ఈనెల 7వ తేదీన గంట ఆలస్యంగా నడవనున్నట్లు ప్రకటించారు. మహారాష్ట్రలోని వీరూర్, వీర్‌గామ్ రైల్వేస్టేషన్ల పరిధిలో నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు జరుగుతున్న దృష్ట్యా రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరగా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం పాత ఉట్నూర్‌కు చెందిన గేడం శశిరేఖ తనకు ఏదైనా ఉద్యోగం కల్పించాలని, నార్నూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన చౌహాన్ బన్నీ తనకు ఉన్నత చదువుల కోసం ల్యాప్‌టాప్ ఇప్పించాలని, వాంకిడి మండలం లీంగూడ గ్రామానికి చెందిన ఆత్రం రాము తనకు ఇల్లు మంజూరు చేయించాలని, మామడ మండల కేంద్రానికి చెందిన లక్ష్మి తమ భూమికి పట్టా చేయించాలని కోరారు. పింఛన్, డబుల్‌బెడ్రూం ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కాగా, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏపీవో వసంత్‌రావు, అదనపు వైద్యాధికారి మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, ఆర్సీవో రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయలు, ఆకుకూరలతోనే ఆరోగ్యం



విత్తనాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, పీవో

ఉట్నూర్‌రూరల్: ప్రతి ఒక్కరూ రోజువారీ ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు ఉపయోగిస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవని కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. సోమవారం ఐటీడీఏ ఉట్నూర్ ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆదిమ గిరిజనులకు (పీవీటీజీలు) ఐటీడీఏ ఉట్నూర్‌లోని కుమురంభీం కాంప్లెక్స్‌లోగల పీఎంఆర్సీ మీటింగ్ హాల్‌లో ఉచితంగా కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ.. 500 మంది గిరిజన రైతులకు కూరగాయ విత్తనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. దుర్వినియోగం చేయకుండా ఖాళీ ప్రాంతాలు, పెరటిలో పొలంలో సాగు చేయాలని సూచించారు. అంతకుముందు ఐటీడీఏ పరిధిలోని ఉద్యాన నర్సరీలో చేపట్టిన వివిధ పంటల సాగు, ప్రదర్శన క్షేత్రాలు, వేసవి కూరగాయల సాగు, ఉల్లి, పసుపు, పూలు (బంతి, చామంతి), మునగ, జామ తోటల పెంపకంపై ఐటీడీఏ ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి సందీప్‌కుమార్ అవగాహన కల్పించారు. రైతులకు ఉపయోగపడే శిక్షణ, వివిధ పంటలు సాగుపై అవగాహన కల్పించిన తీరును కలెక్టర్ ప్రశంసించారు.

స్వచ్ఛదనం–పచ్చదనం ప్రారంభం

ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో కలెక్టర్ రాజర్షి షా కొబ్బరి మొక్కలు నాటి స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ పచ్చదనం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఏపీవో పీవీటీజీ మనోహర్, ఉద్యాన అధికారి సుధీర్‌కుమార్, సిబ్బంది జయరాజు, అర్షిత, శ్యామల, చందర్, పేసా కోఆర్డినేటర్ వసంత్‌రావు తదితరులున్నారు.

అలేఖ్య హత్య కేసులో దర్యాప్తు వేగవంతం

నిర్మల్ రూరల్: ఖానాపూర్ నడిబొడ్డున గత ఫిబ్రవరిలో అలేఖ్య అనే యువతిని తనను ప్రేమించడం లేదనే కోపంతో ఓ యువకుడు హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసినట్లు ఎస్పీ షర్మిల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్ పట్టణంలోని శివాజీనగర్‌లో అంబేద్కర్ నగర్‌కు చెందిన చెట్‌పల్లి అలేఖ్య అనే యువతని, అదే కాలనీకి చెందిన జూకింది శ్రీకాంత్ అనే వ్యక్తి కొబ్బరి బోండాలు నరికే కత్తితో అతి దారుణంగా నరికి చంపినట్లు పేర్కొన్నారు. ఆపడానికి వెళ్లిన అలేఖ్య వదిన జయశీలను కూడా తీవ్రంగా గాయపరిచినట్లు తెలిపారు. హత్య అనంతరం దర్యాప్తు వేగవంతం కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు పారిపోయిన కొన్ని గంటల వ్యవధిలోనే అతడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. జ్యుడీషియరీ సహకారంతో కేసు చార్జిషీట్, కేసుకు కావాల్సిన అన్ని సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. సోమవారం ప్రత్యక్ష సాక్షులను ప్రవేశపెట్టినట్లు ఎస్పీ తెలిపారు. కేసు పురోగతిలో ప్రతిభ చాటిన ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రి, సిబ్బందిని ఆమె అభినందించారు.

వాహనం ఢీకొని ఒకరు మృతి

- మృతదేహంతో కుటుంబీకుల ఆందోళన



సంద విఠల్ (ఫైల్)



టూటౌన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబీకులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని తిర్పెల్లికి చెందిన సంద విఠల్‌ను ఆ కాలనీ సమీపంలోని గంభీర్ హోటల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. క్షతగాత్రుడిని కాలనీవాసులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అతడి కుటుంబీకులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాహనాన్ని గుర్తించకపోవడంతో పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం మృతదేహంతో ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించారు. దీంతో టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. వారు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. అంతకుముందు మృతదేహానికి పోస్టుమార్టం చేసే సమయానికి పోలీసులు ఆస్పత్రికి రాకపోవడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



జీజాబాయి (ఫైల్)

నేరడిగొండ: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. ఏఎస్సై మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం దుప్యాతండాకు చెందిన జాదవ్ తుకారాం తన భార్య జీజాబాయితో కలిసి బస్సులో కూతురు ఇంటికి నేరడిగొండ మండలం దేవుల్‌నాయక్ తండాకు వస్తున్నారు. ఈ క్రమంలో నిర్మల్‌లో బస్సు ఎక్కిన వారు దేవుల్‌నాయక్ బస్టాండ్ వద్ద దిగారు. రోడ్డు దాటే సమయంలో నిర్మల్ వైపు వెళ్తున్న లారీ అతివేగంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డ జీజాబాయి మృతిచెందింది. కూతురు ఇంటికి చేరుకోక ముందే రోడ్డు ప్రమాదంలో మృత్యు ఒడికి చేరింది. దీంతో ఆమె కూతురు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.


చికిత్స పొందుతూ మృతి



సతీశ్ మృతదేహం

ముథోల్: మండలంలోని గన్నోరా గ్రామానికి చెందిన రొమ్మొల్ల సతీశ్ (33) అనే ట్రాక్టర్ డ్రైవర్ చికిత్స పొందుతూ నిజామాబాద్‌లోని ఆస్పత్రిలో మృతి చెందాడు. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. సతీశ్ గత నెల 13న ఓ రైతు పొలంలో కేజీవీల్స్‌తో నూర్పిడి చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని గ్రామస్తులు, తోటి కూలీలు భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అందాల కడెం.. ఆహ్లాదమయం



కడెం.. చుట్టూ పచ్చదనం



ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్



కడెం: సహజ సిద్ధమైన ప్రకృతి అందాలకు నెలవైన కడెం జలాశయం పర్యాటకులకు ఆహ్లాదం పంచుతోంది. వానాకాలం వచ్చిందంటే పచ్చని ప్రకృతి అందాల మధ్య నిండా నీటితో ప్రాజెక్ట్ ఆకట్టుకుంటోంది. ఎటు చూసినా ప్రకృతి అందాలతో మంత్రముగ్ధులను చేస్తోంది. అణువణువునా సోయగాలు ఒలకబోస్తూ మనస్సుకు హాయినిస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ప్రాజెక్ట్‌లో బోటు షికారు ఉల్లాసాన్ని కలిగిస్తోంది. ప్రాజెక్ట్‌ను ఆనుకుని ఉన్న సహ్యాద్రి పర్వత శ్రేణులు పాపికొండలను తలపించి మైమరిపిస్తున్నాయి. నిండా నీటిలో ఐలాండ్, బ్యాక్ వాటర్, సాగునీటికాలువల అందాలు ప్రకృతి ప్రేమికులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.



సహ్యాద్రి పర్వత శ్రేణుల అందాలు



ప్రాజెక్ట్‌లో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు



కుడి కాలువ అందాలు